నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, బుధవారం 5 ఫిబ్రవరి 2025 | MAHABUBABAD

కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మండలి విప్‌గా సత్యవతి రాథోడ్

- కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ
- బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని వెల్లడి

మహబూబాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ) : శాసనమండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవకాశం కల్పించారు. అధినేత నిర్ణయాన్ని కేటీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి స్పీకర్‌కు అందజేశారు. కాగా గిరిజన మహిళను గుర్తించి శాసనమండలి బీఆర్ఎస్ పార్టీ విప్‌గా ఉన్నతమైన పదవిని కట్టబెట్టినందుకు గాను రాష్ట్ర సాధకులు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ కోసం అహర్నిశలు కృషిచేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు సత్యవతి రాథోడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తానని, ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం చేస్తూనే ఉంటానని సత్యవతి తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్‌ను సత్యవతి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలి విప్‌గా అవకాశం కల్పించినందుకు గాను ఆయనకు పుష్పగుచ్చం అందించి ధన్యవాదాలు తెలిపారు.

కేసు నమోదు చేయాలని హనుమకొండ ఎస్సై అశోక్‌తో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

అడ్వకేట్ అయితేందిరా..

- న్యాయవాదిపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి దాడి
- పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు
- బాధితుడి ఫిర్యాదును పట్టించుకోని పోలీసులు
- ఏసీపీని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు
- సీఐని సస్పెండ్ చేయాలని తీర్మానం

సుబేదారి, ఫిబ్రవరి 4 : హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఓ న్యాయవాదిపై దాడి చేశాడు. చొక్కా పట్టుకొని అడ్వకేట్ అయితే ఏందిరా అంటూ బూతులు తిడుతూ తల, చెవిపై కొట్టాడు. అంతటితో ఆగకుండా అతడిని పోలీసు వాహనంలో హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు పెట్టించాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి హనుమకొండలోని కేయూ జంక్షన్ వద్ద జరిగింది. బాధితుడైన న్యాయవాది గంధం శివ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన అంత్యక్రియల కార్యక్రమానికి శివ వెళ్లాడు. అనంతరం అక్కడే కల్లు తాగి రాత్రి 7 గంటలకు హనుమకొండకు బయలుదేరాడు. కేయూ జంక్షన్‌కు చేరుకునే సరికి డ్రంక్ అండ్ డ్రైవ్ విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కారును ఆపి పరీక్షిస్తుండగా తాను న్యాయవాదినని, చావు కార్యక్రమానికి వెళ్లి కల్లు తాగినట్లు చెప్పాడు. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై 'నీవు ఎవరైతేందిరా.. టెస్ట్ చేసుకోరా' అనడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సమాచారం అందుకున్న హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి అక్కడికి వచ్చి శివ చొక్కా పట్టుకొని 'లం..కొడుకా.. అడ్వకేట్ అయితేందిరా' అంటూ తల, చెవిపై బలంగా కొట్టి పోలీసు వాహనంలో ఎక్కించారు. ఆ తర్వాత సీఐ, ఎస్సై, సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు పెట్టించారు. అయితే తాను ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజుల క్రితం కేయూ జంక్షన్ వద్ద హసన్‌పర్తికి చెందిన ద్విచక్ర వాహనదారుడిని సదరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చితకబాదినట్లు తెలిసింది. కాగా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డిపై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు బాధితుడు శివతో కలిసి మంగళవారం ఏసీపీని కలిశారు.

శివపై కేసు నమోదు

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షను అడ్డుకొని ఎస్సై యుగేంధర్, కానిస్టేబుల్ రమేశ్‌ను దూషించిన గంధం శివపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో శివ మద్యం సేవించి కారు నడపుతూ కేయూ జంక్షన్‌కు వచ్చాడని, అతడిని ఎస్సై, కానిస్టేబుల్ ఆపగా తాను అడ్వకేట్‌నంటూ న్యూసెన్స్ చేశాడన్నారు. తనకు టెస్ట్ చేస్తే నాలుగు రోజులు కోర్టు బంద్ చేసి తడాఖా చూపిస్తానని నానా హంగామా చేస్తూ విధులను అడ్డుకున్నాడని వారు పేర్కొన్నారు.

ట్రాఫిక్ సీఐని సస్పెండ్ చేయాలి

వరంగల్ లీగల్: న్యాయవాది గంధం శివపై దాడి చేసిన ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్లు తీర్మానించాయి. మంగళవారం అంబేద్కర్ హాల్‌లో వరంగల్ బార్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సంయుక్త సమావేశంలో శివపై జరిగిన దాడిని ఖండించాయి. ట్రాఫిక్ సీఐ దాడిచేయడమే కాకుండా కేసు పెట్టి న్యాయవాదులను చిన్నచూపు చూడడం హేయమైన చర్యగా తెలిపాయి. దాడిలో పాల్గొన్న సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరాయి. సమావేశంలో బార్ కౌన్సిల్ మెంబర్లు భైరపాక జయాకర్, దుస్సా జనార్దన్, హనుమకొండ బార్ ప్రెసిడెంట్ మాతంగి రమేశ్‌బాబు, వరంగల్, హనుమకొండ ప్రధాన కార్యదర్శులు ముద్దాస్సిర్ అహ్మద్ ఖయ్యామి, లడే రమేశ్, సీనియర్ న్యాయవాదులు ముద్దసాని సహోదర్‌రెడ్డి, పులి సత్యం, గుడిమల్ల రవికుమార్, ఐత ప్రసాద్, వలస సుధీర్, సదాశివుడు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీలో శస్త్ర చికిత్సలకు బ్రేక్!

- ఆపరేషన్ థియేటర్‌లో పనిచేయని ఏసీలు
- ఫ్యాన్‌లతోనే నెట్టుకొస్తున్న వైద్యులు
- వేసవిలో కష్టమేనంటూ పెదవి విరుపు

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 4 : 'పైన పటారం.. లోన లొటారం' అన్న చందంగా ఉంది కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ)లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తీరు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ. 150 కోట్లతో ఆరు అంతస్తుల్లో నిర్మించి పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలను అందించగా, ప్రస్తుతం అందులో మౌలిక వసతులు కరువయ్యాయి. అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌లో నెల రోజులుగా ఏసీలు పని చేయడం లేదు. శస్త్ర చికిత్సలు పూర్తయ్యే వరకు గది ఉష్ణోగ్రత ఒకేలా ఉండడం తప్పనిసరి. అయితే ఏసీలు పని చేయకపోవడంతో శస్త్ర చికిత్సల సమయంలో రోగులు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. దీని కారణంగా ఎక్కువ సమయం పట్టే ఆపరేషన్లను వాయిదా వేస్తున్నారు. దీంతో పేద రోగులకు ఉచిత ప్రభుత్వ వైద్యం అందడం లేదు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీస మరమ్మతులు చేపట్టకపోవడం రోగులకు శాపంగా మారుతున్నది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో వైద్యులు ఉదయం వేళ ఫ్యాన్‌లు ఏర్పాటు చేసుకొని మైనర్ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే వేసవి రానుండడంతో శస్త్రచికిత్సలు కష్టమేనంటూ వైద్యులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏసీలకు మరమ్మతులు చేపట్టాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

అప్పుడే భగభగ!

- రోజు రోజుకూ పెరుగుతున్న ఎండలు
- రెండు రోజుల్లోనే మాయమైన చలి
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు



హనుమకొండ సబర్బన్, ఫిబ్రవరి 4 : వేసవి ప్రారంభం కాకముందే భానుడు భగభగమంటున్నాడు. రోజు రోజుకూ ఎండలు పెరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రెండు రోజుల క్రితం వరకు వణికించిన చలి మారిన వాతావరణంతో ఒక్కసారిగా మాయమైంది. దీంతో కాస్త ఊపిరిపీల్చుకున్న జనం మంగళవారం మాడ పగిలే ఎండ తగలడంతో బెంబేలెత్తిపోయారు. ఇప్పుడే ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో ఇంకా ఎలా ఉండబోతుందోనని ఆందోళన చెందుతున్నారు. అయితే రాత్రి వేళ కొంత చలిగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం మాత్రం ఎండ అధికంగా ఉంటున్నది. నాలుగు రోజుల ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఈ నెల 1న కనిష్ఠంగా 19, గరిష్ఠంగా 32 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. 2న 19, 34, 3న 18, 35, ఇక 4న కనిష్ఠంగా 17.5, గరిష్ఠంగా 36 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. రోజుకొక డిగ్రీ చొప్పున ఎండలు పెరుగుతుండడంతో ప్రజలు బయట తిరగలేకపోతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం బయటకు వస్తున్నవారు సైతం ఎండ నుంచి రక్షణ పొందేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు కొబ్బరి బోండాలు, శీతల పానీయాలు తాగుతున్నారు. వ్యవసాయ బావుల్లో ఒక్కసారిగా నీటి ఊటలు తగ్గిపోవడంతో యాసంగి పంట ఎలా పూర్తవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే మొన్నటి వరకు తేనె మంచు ప్రభావానికి గురైన మామిడి తోటలకు మారిన వాతావరణం లాభం చేకూర్చనుందని యజమానులు భావిస్తున్నారు.

ఎండ నుంచి ఉపశమనానికి బత్తాయి జ్యూస్ తాగుతున్న ప్రజలు

గొడుగు నీడన పండ్లు అమ్ముతున్న చిరు వ్యాపారులు

మేడారంలో నేడు గుడిమెలిగే పండగ

- సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు ప్రారంభం
- వారం రోజుల పాటు పూజారుల ఉపవాస దీక్షలు

కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరం
మేడారంలోని సమ్మక్క దేవత పూజామందిరం

తాడ్వాయి, ఫిబ్రవరి 4 : ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరైన మేడారం సమ్మక్క-సారలమ్మల మినీ జాతర సందర్భంగా ఆదివాసీ పూజారులు నేడు గుడిమెలిగే పండగకు వేళయ్యింది. వచ్చే బుధవారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవార్ల మినీజాతర నిర్వహించనున్న పూజారులు ముందు బుధవారం నాడు గుడిమెలిగే పండగను అంగరంగ వైభవంగా జరిపేందుకు సిద్ధమయ్యారు. మేడారంలోని సమ్మక్క దేవత పూజామందిరంలో సిద్దబోయిన వంశస్థులు, కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరంలో కాక వంశీయులు పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. గుడిమెలిగే పండుగను పురస్కరించుకుని అత్యంత నియమ నిష్ఠలతో పూజారులు గుడిని నీటితో శుద్ధి చేసి అటవీ ప్రాంతంలోకి డోలి వాయిద్యాల నడుమ పూజారులు, వారి కుటుంబ సభ్యులు వెళ్లి గుట్టగడ్డిని తీసుకొని వస్తారు. గడ్డికి పసుపు, కుంకుమలతో పూజలు చేసిన తర్వాత పూజా మందిరాలపై గడ్డిని అలంకరిస్తారు. ఈ తంతుతో వన దేవతల మినీ జాతర ప్రారంభమైనట్లుగా పూజారులు భావిస్తారు. ఇప్పటినుంచి మినీ జాతర ముగిసే వరకు ప్రతి రోజు మందిరాల్లో పూజాకార్యక్రమాలతో పాటు రాత్రివేళల్లో డోలీలతో కొలుపు నిర్వహిస్తారు. 12న మండెమెలిగే పండగతో మినీజాతరలో భక్తులు మొక్కులు సమర్పించడం కోసం అధిక సంఖ్యలో తరలివస్తారు. ఇప్పటికే ముందస్తు మొక్కులు చెల్లించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో వస్తున్నారు.

గద్దెలకు విద్యుత్ కాంతులు

మేడారం మినీ జాతర సమీపిస్తుండడంతో అమ్మవార్ల గద్దెలతో పాటు ఆలయం చుట్టూ ఉన్న సాలహారానికి దేవాదాయ శాఖ అధికారులు విద్యుత్ లైట్లతో అలంకరణ పనులను మంగళవారం ప్రారంభించారు. రాత్రివేళ దర్శించుకునే భక్తులకు అమ్మవార్ల గద్దెలు కనిపించేలా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

మినీ జాతరకు ప్రత్యేక బస్సులు

- 9 నుంచి 16వరకు 200 బస్సులు, 400 ట్రిప్పులు
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాను వెల్లడి

ఆర్ఎం విజయభాను

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4 : ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు జరిగే మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల జాతరకు వరంగల్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాను తెలిపారు. మొత్తం 200 బస్సులు, 400 ట్రిప్పులు ప్రతిరోజు ప్రయాణికుల రద్దీకనుగుణంగా తిప్పనున్నట్లు చెప్పారు. హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి మేడారానికి బస్సులు ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. అన్ని పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మీ పథకం వర్తిస్తుందని, మహిళలు, ఆడపిల్లలు వారి ఆధార్‌కార్డు చూపించి ఫ్రీగా ప్రయాణం చేయొచ్చన్నారు. హనుమకొండ బస్‌స్టేషన్, మేడారంలో ప్రతిరోజు ఇద్దరు కంట్రోలర్లతో పాటు ఒక డిపో మేనేజర్ ఈ ప్రత్యేక బస్సుల ఆపరేషన్ పర్యవేక్షిస్తారన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి వీటిని 24 గంటలు నడిపిస్తామని, వివరాలకు 9959226056 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కొండాయి, దొడ్లలో మండమెలిగే..

కొండాయిలోని గోవిందరాజులు, నాగులమ్మ గుడులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 4 : కొండాయిలో సారలమ్మ, గోవిందరాజులు, నాగులమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం మండమెలిగే పండుగను నిర్వహించేందుకు పూజారులు సిద్ధమయ్యారు. ఈ నెల 12 నుంచి కొండాయిలో జాతర నిర్వహించనున్నారు. ఏటా కొండాయి, దొడ్ల గ్రామాల్లో నిర్వహించే జాతర కోసం ఐటీడీఏ నుంచి నిధులు మంజూరు చేశారు. కాగా నేడు సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజుల గుళ్లను అందులోని పూజా సామగ్రి ఆడేరాలు, పడిగలు, బూరలు ఇతర సామగ్రిని శుద్ధి చేసి అలంకరిస్తారు. ఆలయ ఆవరణను ముగ్గులతో ప్రవేశ మార్గాల్లో మామిడి తోరణాలు కట్టి ముస్తాబు చేస్తారు. మండమెలిగే పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆడబిడ్డలు తలంటూ స్నానాలు చేసి ముగ్గులు వేస్తారు. శుద్ధి చేసిన పూజా సామగ్రిని తిరిగి పసుపు, కుంకుమలతో అలంకరిస్తామని గోవిందరాజుల ప్రధాన పూజారి దబ్బగట్ల గోవర్ధన్, సారలమ్మ పూజారి కాక వెంకటేశ్వర్లు, రాజారం, దబ్బగట్ల సదానందం తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న పూజారులు

బీఎస్ఎన్ఎల్ కేబుల్ కట్

- 20 గ్రామాలకు నో సిగ్నల్
- బ్యాటరీలను ఎత్తుకెళ్లిన దుండగులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 4 : రొయ్యూరు సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కేబుల్‌ను కొందరు దుండగులు కత్తిరించి బ్యాటరీలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. అక్కడినుంచి వాజేడు వైపు కేబుల్ పలు గ్రామాలకు ఉన్నట్లు తెలిసింది. సుమారు 20 గ్రామాలకు బీఎస్ఎన్ఎల్‌తో పాటు జియో సేవలు కూడా నిలిచిపోయినట్లు సమాచారం. జియో ద్వారా అందించే కేబుల్ ప్రసారాలు కూడా ఒక్కసారిగా స్తంభించాయి. బ్యాటరీలు ఎత్తుకుపోయేందుకే కేబుల్‌ను కట్‌చేసినట్లు తెలిసింది. అయితే సిగ్నల్స్ లేకపోవడం, ప్రసారాలు నిలిచిపోవడంతో ఏం జరిగిందోనని వినియోగదారులు కంగారుపడ్డారు. ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

నృత్యం చేస్తూ కుప్పకూలింది

సీరోలు ఏకలవ్య గురుకులంలో ఇంటర్ విద్యార్థి మృతి

రోజా మృతదేహం

కురవి(సీరోలు), ఫిబ్రవరి 4 : నృత్యం చేస్తూ ఇంటర్మీడియట్ విద్యార్థిని ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందిన ఘటన సీరోలు మండలకేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కళాశాలలలో మంగళవారం 10వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠశాల ఆవరణలో ఫేర్‌వెల్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీజే పెట్టగా ఆ పాటలకు విద్యార్థినులు నృత్యాలు చేస్తున్నారు. మరిపెడ మండలం తానంచర్ల గ్రామ శివారు సపావట్‌తండా గ్రామానికి చెందిన సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న సపావట్ రోజా(16) నృత్యం చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే విద్యార్థినిని 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా రోజా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

క్యాన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కొన్నా..

- నా బిడ్డ కోసం మహమ్మారిని జయించా
- మొదటి స్టేజీలో గమనించి సరైన చికిత్స తీసుకున్నా
- ప్రతిమ ఫౌండేషన్ అవగాహన కార్యక్రమంలో సినీనటి గౌతమి

క్యాన్సర్ వాకథాన్‌లో పాల్గొన్న మెడికోలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 4: 'తాను ధైర్యంగా, మానసికంగా, దృఢంగా ఉండి క్యాన్సర్‌ను ఎదుర్కొన్నానని సినీనటి గౌతమి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించగా, ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు క్యాన్సర్ వాకథాన్‌ను ఎంపీ కావ్యతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 2 వేల మంది ఇందులో పాల్గొని ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సినీ నటి గౌతమి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కేర్‌లెస్‌గా ఉండకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. క్యాన్సర్‌ను ముందుగానే గ్రహించి నాశనం చేయాలన్నారు. సమాజంలో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. క్యాన్సర్‌తో ఎంత కష్టపడ్డానో తనకు తెలుసునన్నారు. కరెక్ట్‌గా 20 సంవత్సరాల క్రితం ఫిబ్రవరిలోనే క్యాన్సర్ వచ్చిందని, నాకు ఈ రోజు ఇంకో కొత్త పుట్టినరోజులాగా ఉందన్నారు. ఇప్పుడు 3 కిలోమీటర్లు వాకథాన్ ద్వారా నడిచివచ్చినట్లు ఆమె గుర్తు చేశారు. నాకు క్యాన్సర్ వచ్చినప్పుడు ఇంత అవగాహన లేదని, అప్పుడు నాకు 32 ఏళ్లని, చిన్న పాప ఉండేదని, పరీక్షలు చేసి చెప్పడానికి కూడా డాక్టర్లు చాలా బాధపడ్డారన్నారు. ఎప్పుడు ఏ విధంగానైనా క్యాన్సర్ రావచ్చునని, మానసికంగా ధైర్యంగా ఉండడం చాలా ముఖ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధితులకు న్యూట్రిషనల్ ఫుడ్ అందించాలని కోరారు. ప్రతి రోజూ వ్యాయామం చేస్తే ఎలాంటి రోగాలు రావని, అందరూ నిండుగా హ్యాపీగా బతకాలని గౌతమి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యురాలు డాక్టర్ హరిణి, ప్రతిమ ఇనిస్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ రమేశ్, డైరెక్టర్లు డాక్టర్ ప్రతీక్, డాక్టర్ రాహుల్, డాక్టర్ అవినాష్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

వాకథాన్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి గౌతమి, ఎంపీ కావ్య, డాక్టర్ హరిణి